ప్రజాశక్తి

సోమవారం 4 డిసెంబర్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ దినేష్ కుమార్

కొత్తపట్నం పల్లెపాలెం వద్ద తీరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- కొత్తపట్నం

మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. మండల పరిధిలోని కె.పల్లెపాలెం వద్ద సముద్ర తీరాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా తుఫాను దష్ట్యా అధికారులు చేపడుతున్న చర్యలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తుఫాను సమయంలో ప్రజలు, తీరప్రాంతాల గ్రామస్తులు ఇళ్ల నుంచి బటయకు రావద్దని సూచించారు. సోమ, మంగళ వారాల్లో తుఫాను ప్రభావం ఎక్కువగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో తుఫాన్ షెల్టర్లు, పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో భోజనం, తాగునీటి వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని సూచించారు. తీరంలో రెవెన్యూ, మత్స్యశాఖ, పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది,పోలీసులు, మెరైన్ పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. పడవలు, వలలు, ఇతర సామగ్రిని భద్రపరు చుకోవాలన్నారు. తుఫాను హెచ్చరిక నేపథ్యంలో సహాయక చర్యల్లో పాల్గొనేందుకు రాష్ట్ర విపత్తుల స్పందన దళం(ఎస్‌డిఆర్‌ఎఫ్) నుంచి రెండు బందాలు జిల్లాకు వచ్చినట్లు తెలిపారు. వారిలో 20 మందిని ఒంగోలు, మరో 20 మందిని శింగరాయకొండ మండలం పాకల వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. తొలుత కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. బిఎల్‌ఒలతో మాట్లాడి ఓటు నమోదు, సవరణ కోసం వస్తున్న దరఖాస్తుల తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ విశ్వేశ్వరరావు, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, తహశీల్దారు ▶ 2లో

సిట్టింగుల్లో టిక్కెట్లపై గుబులు

- తెలంగాణా ఫలితాలపై
- పార్టీల్లో మొదలైన తర్జనభర్జనలు
- రెండు పార్టీల నేతలకూ
- అక్కడి ప్రభావం ప్రతిబింబిస్తుందా?

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

తెలంగాణా ఫలితాలపై ఇక్కడ రాజకీయాలు ముడిపడి ఉన్నాయా? అక్కడ ఫలితాలు ఇక్కడ పార్టీలపై ఏ మాత్రం ప్రభావం చూపనున్నాయి ? అక్కడ సిటింగులకు బిఆర్‌ఎస్ టిక్కెట్లు ఇవ్వడం ప్రతికూల ప్రభావం చూపడంలో ఇక్కడ పార్టీలు కూడా అలాంటి ప్రయోగాలకు దిగుతాయా? లేక వెనుకంజవేస్తాయా? అన్నది ఇపుడు ఉత్కంఠ చర్చకు తావిస్తున్నాయి. నిన్న, మొన్నటి వరకూ తెలంగాణా ఎన్నికల ఫలితాల తర్వాతే ఇక్కడ టిక్కెట్ల వ్యవహారం తేలుతుందనే చర్చ వైసిపిలో తీవ్రంగా సాగింది. ఇపుడు అక్కడ బిఆర్‌ఎస్ ఓటమిని చవిచూసింది. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. అందుకు చంద్రబాబు అరెస్టు ప్రభావం కూడా బాగా ఉందని టిడిపి శ్రేణులు గట్టిగా ప్రచారం చేసుకుంటున్నాయి. ప్రతికారంగా భావి స్తున్నాయి. బిఆర్‌ఎస్ ఓటమి ఇక్కడ గుణ పాఠంగా మారుతుందనే భావనలో టిడిపి నేతలున్నారు. జగన్‌కు అన్ని విధాలా సహకరిస్తోన్న కెసిఆర్ ఓటమి ఇక్కడ చర్చకు తావిస్తోంది. ఇక టిక్కెట్ల వ్యవహారంపైనా చర్చ సాగుతోంది. సిట్టింగుల్లో గుబులు మొదలైంది. తిరిగి టిక్కెట్లు వస్తాయా? లేదా? అనేదానిపై సందిగ్ధం కొనసాగుతోంది. ప్రధానంగా వైసిపి సిట్టింగుల్లోనే ఈ వ్యవహారం తీవ్ర చర్చకు దారితీస్తోంది. నిన్నటి వరకూ తెలంగాణా ఎన్నికల తర్వాతే ఇక్కడ టిక్కెట్ల వ్యవహారం తేలుతుందని భావించారు. ఇపుడు సిఎం జగన్ తీసుకునే నిర్ణయం ఎలా ఉంటుంది? మార్పులకు భారీగా శ్రీకారం చుడతారా? అనేదీ చూడాలి. సిట్టింగుపై జనం తీవ్ర వ్యతిరేకంగా ఉన్నట్లు తెలంగాణాలో తేలింది. ఇక్కడా అదే పరిస్థితి ఉందా? లేదా?అన్నది పార్టీల అంచనాలను బట్టి చూడాలి. సిట్టింగులపై ప్రభావం అనేది రెండు పార్టీలకు ప్రతిబింబిస్తుందా? లేక అధికారంలో ఉన్న పార్టీలకే పరిమితమవుతుందా? అనేదానిపైనా ఓ అంచనాకు రావాల్సి ఉంది. ప్రధానంగా వైసిపిలోనే భారీ మార్పులు తప్పవనే చర్చ నడుస్తోంది. ఇప్పటికే నివేదికలు ఆధారంగా మూడు ఎస్‌సి రిజర్వుడు స్థానాల్లో అభ్యర్థుల మార్పుపై వైసిపి అధిష్టానం ఇప్పటికే ఓ అంచనాకు వచ్చింది.మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రాధాన్యత వస్తోన్న వైపాలెం ▶ 2లో

సంస్కరణల పేరిట పేదలపై భారాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు ▶ 5లో

తీరంలో.. ఎగసిపడుతున్న అలలు

- అప్రమత్తమైన మత్స్యకారులు
- బోట్లు, వలలు ఒడ్డుకు తరలింపు 2లో

తుఫాన్‌తో.. రైతుల్లో ఆందోళన

- 50 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ▶ 4లో

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలు

- ఎమ్మెల్సీ కెఎస్. లక్ష్మణరావు
- ఘనంగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి -రేపల్లె

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటాలకు సన్నద్ధం కావాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్షణరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ వేడుకలు, జిల్లా ద్వితీయ కౌన్సిల్ సమావేశం స్థానిక గుత్తికొండ లక్ష్మీ నారాయణ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహిం చారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథులుగా పీడీఎఫ్ ఎమ్మెల్యే కెఎస్. లక్ష్మణరావు, ఎమ్మెల్యే అనగానీ సత్యప్రసాద్ పాల్గొన్నారు. తొలుత యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఉపాధ్యాయ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ భావితరాల నిర్మాతలు ఉపాధ్యాయులని తెలిపారు. ఉపాధ్యాయ మేధావులు కృషి ఫలితంగా 1974లో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడిందన్నారు. అప్పటి నుంచి ఉపాధ్యాయుల సమస్యలు పరిషార్కరం అనే పోరాటాలు చేసి విజయం సాధించినట్లు గుర్తు చేశారు. తల్లిదండ్రులు జన్మనిస్తే ఉపాధ్యాయులు దిశా నిర్దేశం చేసి జీవితాన్ని ఇస్తారని కొనియాడారు. ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తుంటే అణచివేత చర్యలకు పాల్పడుతూ, మెమోలు ఇవ్వటం, ఇళ్లకు వచ్చి నోటీసు అందజేయడం దుర్మార్గమన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షను విధానాన్ని పునర ుద్ధరించాలని ఉద్యమించిన ఉపాధ్యాయులపై ఉక్కు పాదం మోపడం అనైతిక చర్య అని విమర్శించారు. ఎమ్మెల్యే అనగానీ సత్యప్రసాద్ మాట్లాడుతూ సిపిఎస్ ▶ 2లో

సిట్టింగుల్లో టిక్కెట్లపై గుబులు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి ఆయన్ను తప్పించి కొండపి నుంచి పోటీ చేయించాలనే చర్చ నడుస్తోంది. మరోసారి ఇక్కడే అవకాశం కల్పించాలని ఆయన సిఎం జగన్‌ను పట్టుపడుతున్నారు. సంతనూతల పాడు ఎమ్మెల్యేను వేరేచోట నుంచి పోటీ చేయించాలని చూస్తున్నారు. వైపాలెంలోనూ కొత్త అభ్యర్థిని రంగలోకి దించేయోచనలో ఉన్నారు. వీటితోపాటు మిగతా సిట్టింగు స్థానాల్లో మార్పులు తప్పవనే చర్చ మొదలైంది. కనిగిరి, మార్కాపురంలో సిట్టింగులకు తిరిగి టిక్కెట్లు ఇవ్వచ్చనే సంకేతాలు సాధికారిక సభల సందర్భంగా ముఖ్యనేతల ప్రసంగాల్లో కనిపించాయి. ఇపుడు వారికి స్పష్టత ఉంటుందా? లేదా?అనేదీ చూడాలి. గిద్దలూరులో ఎమ్మెల్యే అన్నా రాంబాబు వ్యవహారంపైనా స్పష్టత రాలేదు. దర్శి టిక్కెట్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డికేనన్న చర్చ సాగుతోంది. సిట్టింగు ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ కూడా తీవ్ర ప్రయత్నాల్లో ఉన్నారు. ఆయన వ్యవహారం ఏమిటన్నదీ తేలాల్సి ఉంది. ఒంగోలులో బాలినేని పోటీ ఖాయం. దొక్కటే ప్రస్తుతం స్పష్టంగా ఉంది. ఇక్కడ టిడిపి నుంచి ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్ధన్ బరిలోకి దిగనున్నారు. ఉమ్మడి జిల్లాలోనూ అద్దంకి, పర్చూరు స్థానాల్లో వైసిపిలో ఇంకా గందరగోళంగానే ఉంది. ఇన్‌ఛార్జులు ఉండగా ఇతరుల పోటీకి పరిశీలనలు సాగుతున్నాయి. ఇక టిడిపిలో ఉమ్మడి ప్రకాశంలో ముగ్గురు సిట్టింగుల ఉన్నారు. ఒకరు పార్టీ వీడిన సంగతి తెలిసిందే. అద్దంకి, కొండపి, పర్చూరు ఎమ్మెల్యేలుగా ఉన్న గొట్టిపాటి, వీరాంజనేయ స్వామి, ఏలూరి సాంబశిరావుకు తిరిగి టిక్కెట్లు ఖరారైనట్లే. వీళ్లే ఇక్కడ పోటీలో ఉంటారు. ఇవన్నీ తెలుగుదేశం పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉన్న నియోజకవ ర్గాలు. ఇక్కడ వైసిపి అభ్యర్థులకు గెలుపు అవకాశాలు ఏమిటన్నది ఆపార్టీ నివేదికలే తేటతెల్లం చేస్తున్నాయి. టిడిపి నుంచి కనిగిరిలో ఉగ్ర, గిద్దలూరులో ముత్తుముల అశోక్‌రెడ్డి ఖరారైనట్లే. కందుకూరులో తిరిగి సిట్టింగు ఎమ్మెల్యే మహిధర్‌రెడ్డికి టిక్కెట్టు ఖాయమే. ఇక్కడ ఆపార్టీ నుంచి టిక్కెట్టు ఆశించే నేత ఎవరూ లేకపోవడం విశేషం. చీరాలలో కరణం వెంకటేశ్ వైసిపి నుంచి బరిలో ఉండనున్నారు. తెలుగుదేశం నుంచి ఎంఎం కొండయ్య ఇన్‌ఛార్జిగా ఉన్నారు. వీరిద్దరి మధ్యే పోటీ ఉంటుందా? లేక ఆఖరు నిమిషంలో మార్పులు ఉంటాయా? అనేదీ చూడాలి. ఏదేమైనా తెలంగాణ ఫలితాలు తెలుగుదేశంలో ఉత్సాహాన్ని పెంచగా.. వైసిపిలో కొంత నిర్లిప్తతను కలిగించాయనే చర్చ నడుస్తోంది.

టిడిపి నాయకులతో సమావేశం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కొనకనమిట్ల మండలంలోని గనివానిపాడు, వాగుమడుగు, రేగడపల్లి, అంబపురం గ్రామాలలో తెలుగుదేశం పార్టీ బూత్ కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహం గురించి నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, ఆయా గ్రామాల తెలుగుదేశం నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం రద్దు

ఒంగోలు కలెక్టరేట్ : మిచౌంగ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన స్పందన కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, ఎవరూ ఒంగోలు రావద్దని సూచించారు.

కార్తీక వనభోజన మహోత్సవం

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పట్టణంలో త్రిపురాంతకం రోడ్డులో గల వైష్ణవి గార్డెన్‌లో ఆదివారం కాకతీయ కమ్మవారి వరభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. చిన్న పెద్ద తారతమ్యం లేకుండా అందరూ కలిసికట్టుగా ఉండాలని వారు సూచించారు. అనంతరం దివంగత నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. వచ్చినవారికి అన్ని సౌకర్యాలు కల్పించారు. మ్యూజిక్, పాటలతో అలరించారు. నియోజకవర్గంలోని పెద్దల సహాయ సహకారంతో అన్నదానం నిర్వహించారు.

కార్మిక చట్టాలను కాపాడుకుందాం: సిఐటియు

ప్రజాశక్తి-కంభం రూరల్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాల్ని తుంగలో తొక్కుతున్నాయని, వాటిని కాపాడుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, నాయకులు తోట తిరుపతిరావు ఆరోపించారు. ఆదివారం కంభంలో జరిగిన సిఐటియు మండల మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కాలం సుబ్బారావు మాట్లాడుతూ స్కీం వర్కర్లని మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ విధానాల్ని తిప్పి కొట్టడం ద్వారానే మన దేశ స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను, లౌకికతత్వాన్ని కార్మిక ఉద్యోగుల హక్కులను కాపాడుకోగల మని అన్నారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను మోసం చేసిందని, వారికి కేటాయించిన డబ్బులను వెల్ఫేర్ ఫండ్ నుంచి ఇతర అవసరాలకు మరలించటం దుర్మార్గ చర్య అని విమర్శించారు. స్కీం వర్కర్ల మీద అదనపు భారం మోపడం ద్వారా వెట్టిచాకిరీ చేయిస్తోందని, సమాన పనికి

మాట్లాడుతున్న సిఐటియు నాయకుడు కాలం సుబ్బారావు

సమాన వేతనం, కానీ పనికి తగ్గ వేతనాలు, కనీస వేతనాలు ఇవ్వటం లేదని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయట్లేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాటివిటీ కూడా అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా మోసం చేసిందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 8 నుంచి జరిగే అంగన్‌వాడీ సమ్మెను, 11, 12 తారీకుల్లో జరిగే ఆశా వర్కర్ల ధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్‌పోర్ట్ రంగంలో కోట్లాది మంది కార్మికులు పనిచేస్తున్నారని, వీరి బతుకులు దినదింగండంగానే వున్నాయని అన్నారు. అనంతరం సిఐటియు మండల సమన్వయ కమిటీ కన్వీనర్‌గా షేక్ అన్వర్, సహాయ కన్వీనర్ గా షేక్ ఖాజావలి మరో 15 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో, బిల్డింగ్ యూనియన్, వివో ఏలు, ఆటో యూనియన్, పంచాయతీ, ముఠా, స్కూల్ స్వీపర్స్ తదితర రంగాల నుంచి ఎస్‌కె మహబూబ్ బాషా, ఎస్‌టి కొత్తూరు, టీ దానం, కాశీ రత్తమ్మ, ఎస్కే ముక్తార్, గర్నెపూడి అబ్రహం, ఆర్ అమృతరాజ్, ఉమా లక్ష్మి, ఎస్‌కె నజీర్, జెర్మియా, ఎస్ఎం బాషా, కోటేశ్వరరావు, సిహెచ్ భాస్కర్ ముజీబ్ ఖాన్, ఏ సంజీవయ్య ఎస్కే బాషా, ఎం రోశయ్య, రంగనాథ్, గాలయ్య, వెంకట్ పాల్గొన్నారు.

ఎగసిపడుతున్న అలలు

అప్రమత్తమైన మత్స్యకారులు ● బోట్లు, వలలు ఒడ్డుకు చేర్చుకున్న వైనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

మిచౌంగ్ తుఫాను ప్రభావంతో శింగరాయకొండ మండలం పాకల, ఊళ్లపాలెం వద్ద సముద్ర తీరంలో అలలు ఉధృతంగా ఎగిసిపడుతున్నాయి. గత రెండు రోజుల నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లకుండా మత్స్యశాక అధికారులు మెరైన్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. మత్స్యకారులు బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు చేర్చుకున్నారు.

సముద్రతీరానికి రావొద్దు: సిఐ

తుఫాను ప్రభావంతో సముద్రంలో అలలు ఉధతంగా ఉన్నాయని, తీరం వద్దకు ఎవరూ రావొద్దని శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. పాకల వద్ద సముద్ర తీరాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా మెరైన్ పోలీసులతో మాట్లాడారు. అలలు ఉధృతంగా ఉన్నందున సముద్రంలోకి ఎవరూ వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రెండు రోజుల పాటు సముద్ర స్నానాలు నిషేధించినట్లు ఆయన తెలిపారు.

ట్రైసైకిల్ అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు: మండల పరిధిలోని కందులూరు గ్రామంలో పెదకళ్లగుంటకు గ్రామానికి చెందిన బల్లిపల్లి మాచర్లకు ఆదివారం ట్రైసైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు మన్నం వెంకయ్య, వికలాంగుల జిల్లా యూనియన్ అధ్యక్షుడు పసుమర్తి రాజేష్, ఎస్‌సి సెల్ నాయకులు రమేష్, పైనం మధు, మన్నం చిన్న పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

రమణారావు, గ్రామ సర్పంచి విశ్వనాథపల్లి ఆనంద్, మత్స్యకార యూనియన్ నాయకులు నాగార్జున, గ్రామ కాపులు, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

బాపట్ల జిల్లా: మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. జిల్లా అధికారులు, తహశీలార్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండిఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉండేలా జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్‌డిఒలు చర్యలు తీసు కోవాలన్నారు. ఆర్‌డిఒ, రెవెన్యూ కార్యాలయాలలో కంట్రోల్ రూమ్‌లే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, తుపాను సంరక్షణ కేంద్రాలను పరిశీలించి సిద్ధం చేయాలన్నారు. నిత్యవసర సరుకులు సిద్ధం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులు, తహశీల్దారుకు సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో అధికారులు పర్యటించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు నాలుగు రోజులపాటు ఆయా మండలాలలోనే అందుబాటులో ఉండాలన్నారు. కోత దశకు వచ్చిన పంటలు తక్షణమే సంరక్షించుకునేలా రైతులకు సమాచారాన్ని చేరవేయాలన్నారు. తుఫాను నేపథ్యంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో ఈనెల 4,5 తేదీల్లో పాఠశాలలు, కళాశాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వికలాంగులను కించపరచడం నేరం : జడ్జి

ప్రజాశక్తి-శింగరాయకొండ

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పాకల గ్రామంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కందుకూరు కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి నిఖిల్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో వికలాంగులకు గౌరవప్రదమైన జీవితాన్ని అందించాలన్నారు. వారికి కేటాయించిన పథకాలను తప్పకుండా అందించాలన్నారు. ది రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబులిటీ యాక్ట్ 2016 గురించి ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది సన్నెబోయిన శ్రీనువాసులు, పాకల సర్పంచి సైకం చంద్రశేఖర్, కోర్టు సిబ్బంది శివన్నారాయణ, రవి, న్యాయ సేవా సహాయకులు పంతగాని వెంకటేశ్వర్లు, ఎంపిటిసి శ్రీనివాసులు, వికలాంగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులు క్షేత్ర ప్రదర్శన

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల

పెద్దదోర్నాల మండలం పెద్దదోర్నాల గ్రామంలోని దండా రామిరెడ్డి పొలంలో త్రిమూర్తి సీడ్స్ ప్రై లిమిటెడ్ కంపెనీ వారి మిర్చి 411 రకంపై ఆదివారం రైతు క్షేత్ర ప్రదర్శన జరిగింది. పొలం యజమాని, మిర్చి బ్యాడి రకము, మంచి రంగు కలిగి, అధిక దిగుబడి ఇస్తుందని తెలిపారు. ఈ క్షేత్ర ప్రదర్శన రైతులకు ఏజిఎం ఎం నాసర్‌రెడ్డి విడియో కాన్ఫరెన్స్ ద్వారా చీడ, పీడలను తట్టుకొని అధిక దిగుబడి నిచ్చు రకాలను వివరించారు. ఏరియా సేల్స్ మేనేజర్ వడితె శంకర్ నాయక్ మాట్లాడారు. ఈ క్షేత్ర ప్రదర్శనకు పెద్దదోర్నాల, చిన్నదోర్నాల, బొమ్మలాపురం, రామచంద్రకోట గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

రద్దు కోసం ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటాలను టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులపై చిన్న చిన్న విషయాలకే చర్యలకు పాల్పడం మంచిది కాదన్నారు. ఉపాధ్యాయులను వైన్ షాపులు, బాత్రూంల వద్ద కాపలా ఉంచటం దుర్మార్గమన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒపిఎస్ అమలుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దష్టి సారించాలన్నారు. నిరంకుశ విధానాలను విడనాడాలన్నారు. ఉపాధ్యాయ అక్రమ బదిలీలు నిలుపుదల చేసి కౌన్సిల్ పద్ధతిలో బదిలీలు జరపాలన్నారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ పిఎఫ్ రుణాలు, సరెండర్ లీవ్‌లను విడుదల చేయాలన్నారు. తొలుత రామకష్ణ పబ్లిక్ స్కూల్, శ్రీ పొట్టి శ్రీరాములు స్కూల్, మౌంట్ ఫోర్ట్ స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరనీ అకట్టుకున్నాయి. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జె.వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు హరిప్రియ, ఉపాధ్యక్షుడు బండి బిక్షాలు, కోశాధికారి వెంకటేశ్వర రెడ్డి గౌరవాధ్యక్షుడు పాపారావు, రేపల్లె ప్రాంత జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కౌన్సిలర్ వెంకయ్య, బాపయ్య, రేపల్లె మండల గౌరవాధ్యక్షుడు కపారావు, అధ్యక్షులు చాటగడ్డ రాజ భూషణం, ఉపాధ్యక్షులు ఎం. సత్యనారాయణ ,టి. ఉదయభాను, ప్రధాన కార్యదర్శిగా సుబ్బారావు, కోశాధికారి వి.పున్నారావు, ఎస్ఎఫ్ఐ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

కార్తీక వనభోజనాలు ఐక్యతకు చిహ్నం

ప్రజాశక్తి-దర్శి

కార్తీక వనభోజనాలు ఐక్యతకు చిహ్నమని రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు అన్నారు. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని కురిచేడు రోడ్డులో గల నాగసాయి దత్త ఆశ్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లా ఉదయ్‌భాస్కర్ అధ్యక్షతన ఆదివారం కార్తీక వనభోజనాలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై శిద్దా మాట్లాడుతూ ఆర్యవైశ్యులందరూ ఐక్యంగా ఉండేందుకు ఈ వనభోజనాలు ఎంతో ఉపయోగపడతా యని అన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శిద్దా రాఘవరావు సతీమణి లక్ష్మీపద్మావతి లకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. సాయిబాబా దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం సభ్యులు శిద్దా సుధీర్‌బాబు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం నాయకులు ఒగ్గు పవన్, సూరె చిన్న సుబ్బారావు, అచ్యుత ప్రకాష్, బొగ్గవరపు సుబ్బారావు, మేడా హనుమంతరావు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

ఆర్యవైశ్య వనభోజనాలలో డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి: మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య వనభోజన పూజా కార్యక్రమాల్లో టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. డాక్టర్ ఉగ్రను ఆర్యవైశ్య నాయకులు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు.

డాక్టర్ ఉగ్రను సన్మానిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

7న టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలో నూతనంగా నిర్మించిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఈ నెల 7న ప్రారంభించనున్నట్లు టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పార్టీ నూతన కార్యాలయంలో టిడిపి నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ యర్రగొండపాలెం పట్టణంలోని ఆర్‌అండ్‌బి బంగ్లా రోడ్డులోని మంజునాథ ఫంక్షన్ హాల్ వద్ద నూతనంగా నిర్మించిన యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో యర్రగొండపాలెం మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, పుల్లలచెరువు మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్, త్రిపురాంతకం మండల కన్వీనర్, వలరాజు, పెద్దదోర్నాల మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, శనగా నారాయణరెడ్డి, షేక్ వలి, షేక్ మస్తాన్‌వలి, మాబు, గొట్టం శ్రీనివాసరెడ్డి, కామేపల్లి వెంకటేశ్వర్లు, జడ్డా రవి, బోడ చెన్న వీరయ్య, తోట మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల అభివృద్ధికి కృషి: వైసిపి

ప్రజాశక్తి మార్కాపురం రూరల్

వికలాంగుల అభివృద్ధికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని వైసిపి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ప్రపంచ వికలాంగుల దినోత్సవంను పురస్కరించుకొని స్థానిక ప్రెస్ క్లబ్‌లో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వైసీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా మేనేజర్ ఎలీషా బాబు, ఆర్‌ఎంపి వైద్యులు వైసిపి దివ్యాంగుల విభాగం ప్రకాశం జిల్లా నాయకులు మార్కాపురం టౌన్ అధ్యక్షుడు నడికట్టు వెంకట రమణారెడ్డి, మార్కాపురం మండల అధ్యక్షుడు లుంజల శేఖర్, సురేంద్ర, వెంకటరామయ్య, వెంకటరమణ, అశోక్, బ్రహ్మానందరెడ్డి, సుబ్బారెడ్డి, బాలచంద్రుడు, కరుణయ్య, ఆంజనేయులు, పీరా, ఇసాక్, నర్సయ్య, కాశీ తదితర పాల్గొన్నారు.

కేకు కత్తిరించి శుభాకాంక్షలు తెలుపుతున్న దశ్యం

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని యర్రగొండపాలెం సర్పంచ్ రామావత్ అరుణాబాయి కోరారు. ఆదివారం యర్రగొండ పాలెం పట్టణం ఒకటో సచివాలయ ఆవరణలో వికసిత్ భారత సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. యర్రగొండపాలెం సర్పంచ్ రామావత్ అరుణాబాయి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ప్రజలలో అవగాహన కల్పించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సంకల్పించినట్లు తెలిపారు. డిఎల్‌డివో బివిఎన్ సాయికుమార్ మాట్లాడారు. ముందుగా ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నూతనంగా మంజూరైన గ్యాస్ కనెక్షన్లు, ఓటరు, హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో వైవి నాగేశ్వర ప్రసాద్, ఈఓపిఆర్‌డి ఈ రాజశేఖర్ రెడ్డి, వెంకటాద్రిపాలెం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వి కోటానాయక్, హౌసింగ్ ఏఈ అంజిరెడ్డి, ఎంఈఒ ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి: ఎఒ

ప్రజాశక్తి-అర్ధవీడు

మండలంలోని రైతులు మిచాంగు తుఫాన్ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్ రైతులకు పలు సూచనలు తెలియజేశారు. మండలంలో వరి పంట దాదాపు 200 ఎకరాలలో కోతకు సిద్ధంగా ఉందని, తుఫాను వెళ్ళిపోయే వరకు వాయిదా వేయాలని తెలియజేశారు. ఒకవేళ కోసిన పక్షంలో టార్పాలిన్లు పాలిథిన్ పట్టాలను అందుబాటులో ఉంచుకుని సురక్షిత ప్రాంతంలో ధాన్యాన్ని ఆరపెట్టుకోవాలని ఆయన తెలియజేశారు.

ఆక్రమణలకు పాల్పడలేదు

భూమి మాదే.. డబ్బులిచ్చి కొనుగోలు చేశా: 9వ వార్డు కౌన్సిలర్ సిరాజ్

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

మండల పరిధిలోని గోగులదిన్నె గ్రామ ఇలాఖాలోని సర్వే నెంబర్ 75/1లో 3.10 ఎకరాల భూమి ఆక్రమించింది కాదని, తాను కొనుగోలు చేసిందని వైసీపీ కౌన్సిలర్ మొగల్ సిరాజ్ వెల్లడించారు. స్థానిక తర్లుపాడు రోడ్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తను ఆక్రమించాను అంటూ ఆరోపణలు వస్తున్న పొలమును ముందటి మల్లయ్య రాజు అనే వ్యక్తికి విక్రయించగా అతను ఆ పొలాన్ని కొంతకాలం తర్వాత రాయవరం గ్రామానికి చెందిన కంది రామిరెడ్డికి విక్రయించాడు. 2000 సంవత్సరంలో రామిరెడ్డి ద్వారా తాను తన కుటుంబ సభ్యుల పేరిట స్వాధీనపు ఖరారు రాయించడం జరిగిందన్నారు. కొనుగోలుతో ఈ భూమిని దక్కించుకున్న అనే తప్ప నేను ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదన్నారు. తనపై ఆరోపణలు చేసుకున్న మందటి శివారెడ్డి వద్ద ఎటువంటి ఆధారాలు లేవు. ఈ పొలానికి సంబంధించి తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఈ భూమిలో ఇప్పటికీ తానే అనుభవంలో ఉన్నట్లు చెప్పారు. ఈ సర్వే నంబర్ భూమిని తాము దౌర్జన్యం చేసి ఆక్రమించినట్లు తనపై పోలీసులు కేసు నమోదు చేశారని, త్వరలోనే పోలీసుల విచారణలో ఈ భూమి ఎవరిది అనేదానిపై నిజాలు తెలుస్తాయన్నారు. పోలీసు అధికారులు కూడా ఈ విషయంలో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, తన పొలం సరిహద్దుల్లో ఉన్న వారిని కూడా విచారించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

మాట్లాడుతున్న సిరాజ్‌తుల్లా బేగ్

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-టంగుటూరు

ఈనెల 8 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న అంగన్‌వాడీల సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ తెలిపారు. ప్రజాసంఘాల కార్యాలయంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం పాలకులు, అధికారులకు అనేకసార్లు అర్జీలు ఇచ్చినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. దీంతో గంత్యరం లేక అంగన్‌వాడీలు సమ్మెబాట పడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు టంగుటూరి రాము, నాయకులు వేశపోగు మోజెస్, అంగన్‌వాడీలు ఎం సుభాషిణి, డి విజయలక్ష్మి, బెల్లం శేషమ్మ, టి విజయ పాల్గొన్నారు.

యుటిఎఫ్ నాయకుడి మృతికి సంతాపం

ప్రజాశక్తి-సిఎస్ పురం: యుటిఎఫ్ సీనియర్ నాయకులు అక్షయకుమార్ దత్ మృతి పట్ల సిఎస్ పురం మండలం యుటిఎఫ్ మండల కమిటీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మండల యుటిఎఫ్ అధ్యక్షులు జె వెంకటరావు, ప్రధాన కార్యదర్శి షేక్ పాదుషా, జిల్లా కార్యదర్శి ఏ సురేష్ సంతాపం వ్యక్తం చేశారు.

వికలాంగులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-పొదిలి

ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా పొదిలి నిర్మమహేశ్వర స్వామి దేవస్థానం (శివాలయం)లో ఆదివారం పదిమంది వికలాంగులకు పొదిలి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల అధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వారికి అవసరమైన విరాళాన్ని దాతలు కల్లం వెంకట సుబ్బారెడ్డి, ప్రదీప్ (టీచర్), పయ్యావుల మహేష్ బాబు, రావూరి చెంచయ్య, మువ్వల పార్థసారథి, షేక్ నూర్జహాన్ బేగం, పడిగపాటి భిక్షాల్ రెడ్డి, బండి ఓబుళరెడ్డి, దోసపాటి నరసింహారావు, చల్లా రాఘవరెడ్డి, కంచాని నరేష్ అందించారు. ఈ సందర్భంగా మానవత సంస్థకు వికలాంగుల యూనియన్ తరపున నరసింహారావు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడులో ఆదివారం ఉదయం స్థానిక వాల్మీకి బజారులో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. వివరాల్లోకి వెళితే.. రేగుల పెదవెంకయ్య(40) అదే బజారులో నివాసముంటున్న ఒక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఆ మహిళ దగ్గర దాదాపు రూ.3 లక్షలకు పైగా డబ్బులు తీసుకొని వాడుకున్నాడు. అయితే ఆమె తన డబ్బులు అడగడంతో వారి మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో మహిళ, ఆమె కుమారుడు కలిసి పెదవెంకయ్యను గోడకేసి బాదగా అక్కడికక్కడే మృతి చెందాడని ఎస్ఐ ఎం దేవకుమార్ తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలయిన ఆ మహిళను అదుపులోకి తీసుకున్నామని, కుమారుడి పాత్రపై సమగ్ర విచారణ చేస్తున్నామని తెలిపారు. కుమారుడి పాత్ర కూడా ఉందని తేలితే అతడిని కూడా అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు. ఈ కేసును దర్శి సిఐ బి పాపారావు పర్యవేక్షిస్తున్నారని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని ఆయన తెలిపారు. మృతుడు పెదవెంకయ్యకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

మృతిచెందిన పెద్దవెంకయ్య

బోల్తా పడిన ఆటో

ఆటోబోల్తా.. ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి-మద్దిపాడు: ఆటో బోల్తా కొట్టిన ఘటనలో 8 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గ్రోత్ సెంటర్ సమీపంలోని అంజలి గ్రానైట్స్ ఎదుట జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. లింగంగుంట గ్రామానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు ఆటలో శింగరకొండ దేవాయాలనికి బయలు దేరారు. అంజలి గ్రానైట్స్ వద్దకు వచ్చేసరికి ఆటో బోల్తా కొట్టింది. దీంతో ఆటోలోని 8 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఒంగోలు హాస్పిటల్‌కు తరలించారు.

వాహనాన్ని ఢీకొన్న కారు

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-పంగులూరు

వేగంగా వెళుతున్న ఓ కారు ముందు వెళు తున్న వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలైనట్లు తెలిసింది. ఒంగోలుకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో కోటప్పకొండకు వెళ్లి తిరుగు ప్రయాణంలో జాతీయ రహదారిలో వస్తున్నారు. కారు రేణింగవరం దాటి అలవలపాడు స్టేజికి వచ్చే సమయంలో, అద్దంకి నుంచి ఇంకొల్లు వెళ్తున్న ఒక పార్సిల్ వాహనం ముందు వెళు తోంది. అలవలపాడు స్టేజి దగ్గర అతివేగంగా వచ్చిన కారు ముందు వైపు వెళుతున్న పార్సిల్ వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం బాగా దెబ్బతింది. ఇందులో నలుగురు వ్యక్తులు ఉండగా, ముగ్గురికి గాయాలయ్యా యి. వెంటనే వారిని ఒంగోలు ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించినట్లు తెలిసింది. ఈ విషయమై రేణింగవరం ఎస్ఐ తిరుపతిరావు సమాచారం కోరగా, ప్రమాదం జరిగిన మాట వాస్తవమేనని అన్నారు. అయితే కారులో ఉన్నవారు ప్రమాదానికి కారణం తమ తప్పేనని, నష్టపోయింది కూడా తామేనని, కేసు వద్దని చెప్పడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

దెబ్బతిన్న కారు

సచివాలయ భవనం ప్రారంభిస్తున్న మంత్రి నాగార్జున

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - భట్టిప్రోలు (వేమూరు)

వేమూరు మండలం చంపాడు గ్రామ సచివాలయాన్ని మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల వద్దకే పాలన అందించేందుకు సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సచివాలయాల వ్యవస్థ తీసుకువచ్చారని అన్నారు. పరిపాలనను ప్రజలకు చేరువ చేశారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా పని చేసే జగన్మోహన్‌రెడ్డి ముందు చూపుతో సచివాలయం వ్యవస్థ తీసుకొచ్చారని అన్నారు. ఈపాటికే ఆ గ్రామాల్లో సచివాలయాలు పూర్తి చేసుకుని పాలను కొనసాగిస్తున్నాయని అన్నారు. మిగిలినవి కూడా వివిధ దశలో ఉన్నాయని తెలిపారు. వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం రూ.కొట్లు ఖర్చుపెట్టి సచివాలయం, ఆర్‌బికె, వెల్నెస్ సెంటర్ వంటి భవనాల ద్వారా ప్రజలకు అన్ని రకాల సేవలు అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లమాటి మోహన్, జడ్పిటిసి గాజుల హేమలత, పిఎసిఎస్ అధ్యక్షులు గాజుల భాను ప్రకాష్, వేమూరు ఎఎంసి మాజీ చైర్మన్ బొల్లిమంత ఏడు కొండలు, కోగంటి లవకుమార్, గాజుల మోహన్ పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

పట్టణంలోని కేర్ డెంటల్ అధ్వర్యంలో స్థానిక చెంగల్ రాయుని తోటలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఆ ప్రాంత వాసులకు దంత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. నేత్ర పరీక్షలు చేశారు. షుమారు 60 మందికి దంత పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. కేర్ డెంటల్ వైద్యులు డాక్టర్ సృజన మాట్లాడుతూ దంత సంరక్షణ తప్పని సరిగా చేసుకోవాలని అన్నారు. తరచుగా పేద వారు నివసించే ప్రాంతాల్లో తమ వైద్య శాల అధ్వర్యంలో శిబిరాలు ఏర్పాటు చేసి దంత పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. మందులు ఉచితంగా అంద చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అప్తాల్మిక్ ఆఫీసర్ పసుపులేటి శ్రీనివాసరావు, పిజియో థెరపిస్ట్ డాక్టర్ సందీప్ పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సృజన

అల్పాహారం వడ్డిస్తున్న జడ్జి ఎస్‌కె నిషాద్‌జాన్

న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - చీరాల

దివ్యాంగులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె నిషాద్‌నాజ్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేడ్కర్ భవన్ నందు న్యాయ విజ్ఞాన సదస్సు ఆదివారం నిర్వహించారు. దివ్యాంగులను కించపర్చితే చట్టపరమైన చర్యలకు బాధ్యులౌతారని అన్నారు. దివ్యాంగులు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం దివ్యాంగులకు అల్పాహారం, మంచినీటి బాటిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి రమేష్ బాబు, సీనియర్ న్యాయవాది శ్రీకాంత్ ఠాకూర్, మహిళా న్యాయవాది యు స్నేహ, పిఎల్‌విఎస్‌డి మతీన్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో రైతుల్లో ఆందోళన

◆ కోతకు సిద్ధంగా ఉన్న 50వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

వరి బోదెలను కట్టలు కడుతున్న రైతులు

జిల్లాలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావం అధికంగానే ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. తుఫాను మచిలీపట్నం, నెల్లూరుల మధ్య తీరం దాటవచ్చునని తెలుస్తుంది. ఈ క్రమంలో చేతికి అంది వచ్చేదశలో ఉన్న వరిపైరును కాపాడుకోవడం ఎలా అనే విషయమై రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 2.20లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటి వరకు దాదాపు 15వేల ఎకరాల్లో మాత్రమే వరికోతలు జరిగాయి. ఇందులో 50వేల ఎకరాలు కోతకు సిద్దంగా ఉంది. మరో లక్షన్నర ఎకరాల్లో వరి పైరు కంకులు పోసుకుని కొద్ది రోజుల్లో కోతకు సిద్దమయ్యే స్థితిలో ఉంది. గత కొద్ది రోజులుగా వరి పైరు కోతలు వచ్చి ఉన్నప్పటికి వర్షాలు కురుస్తున్న క్రమంలో రైతులు కోతలు ఆపారు. కూలీల ద్వారా వరికోతలు పూర్తి చేసి పొలంలోనే కుప్పలు వేస్తే వర్షాల కారణంగా నష్టమని ఆగారు. కొందరు రైతులు వరి నూర్పిడి యంత్రాల ద్వారా వరి కోయడం, అమ్మకాలు కూడా పూర్తి చేశారు. బాగా ఈదురు గాలులు వీచే ప్రమాదం ఉండడంతో కోతకు వచ్చిన వరి పైరు నేల కొరిగే ప్రమాదం ఉంది. కంకి పోసుకుని గింజ గట్టిపడుతున్న వరి కూడా నేలకు ఒరిగే ప్రమాదం ఉంది. తుఫాను ప్రభావంతో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలతో పాటు వరదలు వచ్చే ప్రమాదం ఉంది. దీంతో ఎక్కువ రోజులు వరి పైరు నీట మునిగిపోయే పరిస్థితులుంటాయి. వరి పైరు ఎక్కువ రోజులు నీటిలో ఉంటే ధాన్యం రంగు మారుతుంది. మొలకలు వస్తాయి. తాలు కంకులు ఏర్పడుతాయి. వేమూరు, రేపల్లె, బాపట్ల వ్యవసాయ డివిజన్లలో వరి సాగు చేసిన రైతులు అపారంగా నష్టపోయే పరిస్థితులున్నాయి. కొందరు రైతులు తుఫాన్ ప్రభావం వరి పైరుపై పడక ముందే వరి కోతలు పూర్తి చేయాలని భావించి కంబైన్డ్ హార్వెస్టర్ల కోసం ప్రయత్నాలు చేశారు. కాని అవి రైతుల అవసరాలకు సరిపడాలేవు. ఇతర ప్రాంతాల నుంచి వీటిని తెప్పించారు. గతంలో ఎకరా కోతకు రూ.2500 తీసుకునేవారు. ఇప్పుడు డిమాండ్ పెరగడంతో రూ.4వేలు వరకు తీసుకుంటున్నారు. అయినప్పటికి కంబైన్డ్ హార్వెస్టర్లు అందుబాటులో లేక రైతులు కూలీలతో వరికోతలు పూర్తి చేసి అప్పటికప్పుడే కుప్పలు వేస్తున్నారు. పైరు ఆరకుండా కుప్పలు వేయడం వలన కొంత నష్టం ఉన్నప్పటికి భారీ వర్షాల వలన పంట నష్టం అధికంగ ఉంటుందని రైతులు భావిస్తున్నారు. వరి కోతకు వస్తున్న సమయంలో 75కిలోల ధాన్నాన్ని వ్యాపారులు రూ.1800 రేటుపై కొన్నారు. అఎప్పుడయితే వర్షాలు పడుతూ రైతులు కంగారుపడ్డారో అప్పటి నుంచి రేటు తగ్గించి రూ.1600 రేటుపై కొనుగోళ్ళ జరిపారు. గత కొద్ది రోజులుగా ధాన్యం దిగుబడులు గణనీయంగా తగ్గికున్న నేపథ్యంలో రేటు ఉంటుందని భావిస్తున్న వ్యాపారులు శనివారం రూ.1700 రేటుపై ధాన్యం కొనుగోళ్ళు జరిపినట్లు చెబుతున్నారు.

వరి పైరు రక్షణకు చర్యలు

అయితే కోతకు సిద్దంగా ఉన్న వరి పంటను సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ల ద్వారా కోసి ధాన్యాన్ని రక్షించుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వరి పనలు చేలో పరిచి ఉన్నట్లయితే తక్షణమే కట్టలు కట్టి వాటిపై అవి వర్షంలో తడువకుండా టార్పాలిన్‌తో కప్పుకోవాలి. గింజ గట్టిపడే దశలో వెన్ను బరువు వల్ల వరి పైరు కొద్దిపాటి గాలి, వర్షానికే కణుపుల వద్ద విరిగి నేలకు పడిపోతాయి. ఇలా పడిన దుబ్బులను వెంటనే లేపి నిలబెట్టి కట్టలుగా కట్టాలి. వరి కంకుల మీద 5శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పడే విధంగా పిచికారి చేయాలి. పూర్తిగా ఆరని పనులను కుప్పలు వేసేప్పుడు ఎకరాలకు 25కిలోల ఉప్పును పనలపై చల్లడం వలన గింజలు రంగు మారకుండా, మొలకెత్తకుండా ఉంటాయి.

జూనియర్ లెక్చరర్ల సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - రేపల్లె

నూతనంగా ఎన్నికైన జూనియర్ లెక్చర్ల సంఘం ప్రతినిధులు

ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కమిటి సమావేశం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించారు. సమావేశానికి పి సుధాకరరావు అధ్యక్షత వహించారు. నూతన కమిటీ ఎన్నుకున్నారు. జిజెఎల్ఎ జోన్3 అధ్యక్షులు సిహెచ్ సతీష్ బాబు, జిల్లా కార్యదర్శి ఎం అనిల్ కుమార్, మహిళా కార్యదర్శి సి సీత ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. సాధారణ బదిలీల కారణంగా జిజెఎల్ఎ జిల్లా కార్యవర్గంలో ఏర్పడిన ఖాళీలకు నియమించారు. వైస్ ప్రెసిడెంట్‌గా రేపల్లె గణిత అధ్యాపకులు కె శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శిగా కావూరు ఎకనమిక్స్ అద్యాపకులు ఆర్ మరియాదాస్, కోశాధికారీగా సంతమాగులూరు ఫిజిక్స్ అద్యాపకులు ఎస్‌వి రామేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు పి సుధాకరరావు ఎన్నికైన వారిచే ప్రమాణస్వీకారం చేయించారు. సమావేశంలో క్యాడర్‌కు సంబందించిన వివిధ సమస్యలు చర్చించి తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు.

10న ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - పర్చూరు

స్థానిక అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో ఈనెల 10న జరిగే ముస్లింల ఆత్మీయ సమావేశం విజయవంతం చేయాలని ముస్లిం మైనారిటీ నాయకులు కోరారు. సమావేశానికి శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరవుతారని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - చీరాల

నూర్ భాష (దూదేకుల) ముస్లిం సంక్షేమ సంఘం చీరాల నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షులు అజీజ్ ఎంపిక చేశారు. అధ్యక్షులుగా షేక్ నాగూర్ మీరా వలి, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ హుస్సేన్, షేక్ మదీన, సెక్రటరీగా షేక్ బాజి కరీం ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. వేటపాలెం ప్రెసిడెంట్ బాబావలి, మస్తాన్, మస్తాన్ వలి, ఆజాద్ పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండినవారికి ఓటు హక్కు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఆర్‌ఒ మోహనరావు

18ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించేందుకు బిఎల్‌ఒలు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉమ్మడి గుంటూరు జిల్లా జడ్పీ సీఈఒ మోహనరావు సూచించారు. స్థానిక అద్దేపల్లి పోలింగ్ బూత్‌లో ఓట్ల నమోదు ప్రక్రియ ఆయన ఆదివారం పరిశీలించారు. ఓటు హక్కు పొందిన వాళ్ళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని అన్నారు. పోటీ చేసే అభ్యర్థులను ఎన్నుకునేందుకు ప్రధానమైనదని అన్నారు. డిసెంబరు 15వరకు ఓటు హక్కు పొందెందుకు అవకాశం ఉందని తెలిపారు. ఆయన వెంట తహశీల్దారు డి వెంకటేశ్వరరావు, ఆర్ఐ శివరామకృష్ణ ఉన్నారు.

ఘంటసాల సంగీత విభావరిలో కోట వెంకటేశ్వరరెడ్డి

ఘంటసాల సంగీత విభావరి

ప్రజాశక్తి - చీరాల

ఘంటసాల పాటలను, చైతన్య గీతాలను భావితరాలకు అందించాలని ఘంటసాల చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, జెవివి సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి కోరారు. ఘంటసాల 101వ జయంతి ఉత్సవాలలో భాగంగా సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఘంటసాల సంగీత విభావరి ఆదివారం నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి ఏ రామారావు అధ్యక్షత వహించారు. ఘంటసాల మధురమైన గేయాలతో పాటు దేశ భక్తి, భక్తి గేయాలను ఆలపించారు. ఘంటసాల తెలుగువారి సాంస్కృతిక సంపదని కొనియాడారు. కార్యక్రమంలో ఏ నాగవీరభద్రచారి, బక్క జయరామిరెడ్డి, శివప్రసాద్, రవీంద్రనాథ్, ఎస్‌కె సిలార్ సాహెబ్, హనుమంతరావు, మణిబాబు, అమర రాఘవరావు, కెవి నారాయణ, సామ్రాజ్యం, లోహియా, నిర్మలమ్మ, కళ్యాణి, బిట్రా చైతన్య కుమార్ పాల్గొన్నారు.

బదిర విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసిన న్యాయవాదులు

విద్యార్థులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదులు పోతిన సురేంద్ర, దగ్గుబాటి రాఘవయ్య చౌదరి మండలంలోని నాగులపాలెం బదిరుల పాఠశాల విద్యార్థులకు పండ్లు బిస్కెట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత ప్రమాణాలతో చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు. అనంతరం పాఠశాల సిబ్బంది, బధిర విద్యార్థులు ప్లే కార్డులు ప్రదర్శిస్తూ నాగులపాలెం నుండి స్థానిక బొమ్మల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడలు నిర్వహించి విజేతలకు కరస్పాండెంట్ కె ఆంజనేయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిహెచ్ ఉమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యశిభిరం ప్రారంభిస్తున్న విద్యానికేతన్ కోటేశ్వరరావు

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి- కొత్తపట్నం

ఒంగోలులోని శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చాపల వంశీకష్ణ ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాణి విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 70మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎముకలు, కీళ్లు, నరాలు, స్త్రీల సమస్యలు, గర్భిణులు, దగ్గు, నెమ్ము, ఆయాసం, ఛాతి, ఊపిరితిత్తులు, చిన్న పిల్లలు, ఇఎన్‌టి, దంత సమస్యలు, బిపి, షుగర్, థైరాయిడ్, ఫిజియో థెరపీ తదితర పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సానల ధీరజ్ బాబు, డాక్టర్ సున్నపు విజయ్ కుమార్, డాక్టర్ నాగిడి కుమార్ వర్మ, డాక్టర్ బి హరికష్ణప్రసాద్, డాక్టర్ నందలూరు సరయు, డాక్టర్ పొక్కినగారి ఏడుకొండలు, శ్రీవాణి విద్యానికేతన్ కరెస్పాండెంట్ చాపల కోటేశ్వరరావు, వినుకొండయ్య, మహేంద్ర కుమార్‌వర్మ, ప్రదీప్‌వర్మ, పట్టపు ప్రకాశం, హాస్పిటల్ మేనేజర్ సుధాకర్, రవి, నాగరాజు, సూపర్‌వైజర్ కొక్కిలిగడ్డ శ్రీను, మాల్యాద్రి, పున్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రూ.10 ఇచ్చి రూ.10 వేలు దోపిడీ

రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి విమర్శ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంటపాడు గ్రామ పంచాయతీలో కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పేదలకు పది రూపాయలు ఇచ్చి వేల రూపాయలను దోచుకుంటున్నారన్నారు. టిడిపి అధికారం లోకి రాగానే ఇసుక ఉచితంగా ఇస్తామని అన్నారు. మూలగుంటపాడు గ్రామ పంచాయతీలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామని తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ ఇస్తామన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

బీసీలకు రక్షణ చట్టం ద్వారా అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, నరాల సుధాకర్, కనిగిరి వెంకటేశ్వర్లు వర్మ, అంబటి శ్రీను, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, మించల బ్రహ్మయ్య, నక్క బ్రహ్మేశ్వరరావు, చీమకుర్తి శ్రీకాంత్, పెరుగు నరసింహారావు, శీలం చంటి, సుదర్శి ప్రసాదరావు, తెలుగు యువత అధ్యక్షుడు షేక్ సనాఉల్లా, షేక్ యస్ధాని తదితరులు పాల్గొన్నారు.

దర్శి: భవిష్యత్తులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీకి టీడీపీ హామీ ఇస్తుందని ఆ పార్టీ మాజీ లీగల్ సెల్ అధ్యక్షులు పరిటాల సురేష్ అన్నారు. ఆదివారం బొట్లపాలెంలో సైకిల్ యాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసమే టీడీపీ పాటుపడుతుందని, భవిష్యత్తు తరాల కోసం చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఓటు నమోదు తనిఖీ

ప్రజాశక్తి-చీమకుర్తి

అర్హత ఉండి ఓటు హక్కు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దారు పిన్నిక మధుసూధనరావు తెలిపారు. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో చేపట్టిన ఓటు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం తనిఖీ చేశారు. ఓటర్ల ప్రక్రియ గురించి బిఎల్‌ఒలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా తహశీల్దారు పిన్నిక మధుసూదనరావు మాట్లాడుతూ సంతనూతల పాడు నియోజకవర్గం నాలుగు మండలాల్లో ఈ నెల 2,3 తేదీలలో నిర్వహించిన స్పెషల్ క్యాంపెయిన్‌లో ఫారం-6 421 దరఖాస్తులు, ఫారం-7 166 దరఖాస్తులు, ఫారం-8 624 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సీనియర్ అసిస్టెంట్, సూపర్‌వైజర్లు, బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

పేదలకు వైద్యసేవలే ధ్యేయం: ఏలూరి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

గ్రామీణ ప్రాంత పేదలకు వైద్యసేవలు అందించడమే తమ ధ్యేయమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో ఏలూరి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఏలూరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శంకర కంటి వైద్యశాల సహకారంతో పుల్లెల అజయ్‌బాబు సహకారం తో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యేలు సాంబశివరావు, గొట్టిపాటి రవికుమార్, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 100 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 20 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధారించారు.

వైద్య శిబిరం ఏర్పాటు చేసిన దృశ్యం

నేటి నుంచి భద్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-చీమకుర్తి

ప్రకాశం, బాపట్ల, పలనాడు జిల్లాల పరిధిలోని గ్రానైట్ గనులలో సోమవారం నుంచి భద్రతా వారోత్సవాలు నిర్వహించ నున్నారు. అందులో భాగంగా ఈ నెల 4 నుంచి 9 వరకూ గనులలో ట్రేడ్ టెస్టులు నిర్వహిస్తారు. గనులలో వివిధ అంశాలపై సేఫ్టీవీక్ టీములు పరీక్షలు నిర్వహిస్తారు. ఈనెల 11 నుంచి 16 వరకూ ఇన్‌స్పెక్షన్ నిర్వహిస్తారు. ఈ నెల 24న ఫంక్షన్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఘంటసాల విగ్రహానికి నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు విగ్రహానికి అభయకళారాధన సంస్థ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పోలీసు స్టేషన్ వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి ఆదివారం పూలమాలులు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, వార్రా వీర్రాజును సత్కరించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, జగనన్న ఫౌండేషన్ చైర్మన్ వార్రా వీర్రాజు, అభయ కళారాధన సంస్థ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు, నాయకులు ఇస్తర్ల శంకర్, దోమల వెంకటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్

హాస్టల్లో మెనూ అమలు చేయాలి: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరి ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో కనిగిరిలోని బీసీ బాలుర కాలేజీ హాస్టల్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్, పట్టణ కార్యదర్శి మధు, ఇతర నాయకులు ఆదివారం సందర్శించారు. ఆదివారం రోజు ఉదయం పూరీ ఇవ్వాల్సి ఉండగా అన్నం, పచ్చడితో కాలం గడిపించారు. హాస్టల్లో భోజనం రుచికరంగా ఉండటం లేదని, సక్రమంగా మెనూ అమలు కావడం లేదని విద్యార్థులు ఎస్ఎఫ్ఐ బృందం ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ ఒక హాస్టల్‌ను నిర్వహించడానికి వార్డెన్, ఏబిసిడబ్ల్యు, హాస్టల్ సిబ్బంది ఇలా ఐదుగురిని నియమించి వారికి జీతం ఇచ్చి నడపమంటుంటే వాళ్లు మాత్రం విద్యార్థులకు పచ్చడి మెతుకులు పెట్టి జేబు నింపుకుంటున్నారని అన్నారు. అదేమని అడిగితే సంబంధంలేని కుంటిసాకులు చెబుతున్నారన్నారు. విద్యార్థులు అర్థాకలితో అలమటిస్తున్నారన్నారు. గత రెండు నెలల కాలంలో బీసీ హాస్టల్‌లో మెనూ అమలు కావటం లేదు అనే విషయాలను ఆధారాలతో సహా నిరూపించి జిల్లా అధికారులు దృష్టికి తీసుకు పోయినా, ఇంకా ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉండటం అత్యంత దుర్మార్గమని అన్నారు. పేద విద్యార్థులపై ఇటువంటి వైఖరిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. సమస్యలపై జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకుడు బాబూరావు

సంస్కరణల పేరిట పేదలపై భారాలు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పట్టణ సంస్కరణల వల్ల పేదలకు, మధ్యతరగతి ప్రజలకు నష్టం కలుగుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం ఒంగోలు నగర, చీమకుర్తి పట్టణ కార్యకర్తల సమావేశం సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చీకటి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ సంస్కరణల పేరుతో ప్రజలపై చెత్త సేకరణ పన్నులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆధారంగా ఇంటి పన్నుల పెంపుదల, పౌర సేవలకు రుసుం వసూలు చేస్తున్నట్లు తెలిపారు. ఇలా ప్రతి సేవకు పన్ను వసూలు చేసే విధానాన్ని వైసిపి ప్రవేశపెట్టిందని విమర్శించారు. సంస్కరణల వల్ల కార్పొరేట్ సంస్థలకు, కాంట్రాక్టర్లకు లాభం తప్ప ప్రజలకు ఎలాంటి ఉపయోగం లేదన్నారు. భారాలకు వ్యతిరేకంగా ప్రజా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఒంగోలు నగరంలో ఇళ్ల స్థలాల సమస్య, టిడ్కో ఇళ్ల సమస్య, పోతురాజుకాలువ ఆధునీకరణ సమస్య, తాగునీరు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పరిష్కరించకపోతే ప్రజలను కూడగట్టి పోరాటాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కరెంటు ఛార్జీలను విపరీతంగా పెంచి ప్రజలపై భారాలు మోపిందన్నారు. ఈ భారాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు పూసపాటి వెంకట్రావు, బంకా సుబ్బారావు, నగర కమిటీ సభ్యులు ఎస్‌డి హుస్సేన్, మహేష్, అత్తింటి శ్రీనివాసులు, దారా వెంకటేశ్వర్లు, ఎస్‌కె హరికృష్ణ, కొర్నెపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న బాలనాగయ్య

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలలో పనిచేస్తున్న వివిధ కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సిఐటియు నాయకులు జి బాలనాగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గిద్దలూరు యుటిఎఫ్ కార్యాలయం నందు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న వర్కర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతుల్లో బలనాగయ్య పాల్గొని మాట్లాడుతూ పాలక పార్టీలు అధికారంలోకి రావటానికి అనేక రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని ఆ పథకాలను ప్రజలల్లోకి తీసుకుపోయే వర్కర్లకు కనీస వేతనం ఉద్యోగ భద్రత అమలు కావట్లేదని అన్నారు. నెలలు తరబడి గౌరవేతనాలు బిల్లులు పెండింగ్లో ఉన్నాయని, రాబోయే రోజుల్లో వివిధ ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న వర్కర్లందరూ ఐక్యమై సంఘటితంగా పోరాటం చేసి హక్కులు సాధించుకోవాలని పిలుపు నిచ్చారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, తదితర సౌకర్యాలు పథకాలలో పనిచేసే వర్కర్లకు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ శిక్షణా తరగతుల్లో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి టి ఆవులయ్య, రాచర్ల మండల కార్యదర్శి డి తామస్, కొమరోలు మండల కార్యదర్శి వై సింగరయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు డి స్వర్ణ, మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం నాయకులు ఏ కుమారి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కె నూర్జహాన్, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు పుష్ప, స్వచ్ఛభారత్ కార్మిక సంఘం నాయకులు జి ఆనందరావు పాల్గొన్నారు.

గౌరవ వేతనం పేరుతో వెట్టిచాకిరీ

ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ

ప్రజాశక్తి మార్కాపురం రూరల్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గౌరవ వేతనం పేరుతో స్కీం వర్కర్ల చేత వెట్టి చాకిరీ చేయిస్తున్నాయని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బారావమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రెడ్డి మహిళా కళాశాలలో మార్కాపురం, యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని స్కీం వర్కర్లకు సిఐటియు ఆధ్వర్యంలో ఆదివారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావమ్మ మాట్లాడుతూ స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. రిటైర్ అయిన వారికి రూ.ఐదు లక్షలు నగదు, సగం జీతం పెన్షనుగా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు స్కీం వర్కర్లకు వర్తింపజేయాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8 నుంచి అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫీ, ఉపాధ్యక్షుడు పి రూబెన్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ఎం బాలమ్మ, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు ప్రభావతి, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ నాయకులు సుబ్బలక్ష్మి, మల్లీశ్వరి, ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, సుబ్బమ్మ, నాగలక్ష్మి, జడ్ సికోరా, ఎ నాగరాజు కుమారి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న దృశ్యం

వికలాంగులను సన్మానిస్తున్న హక్కుల పరిరక్షణ సంఘం

వికలాంగులకు సన్మానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఆల్ ఇండియా షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు మండలాల్లోని సుమారు 20మంది వికలాంగులను షాలువాలతో ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి, బాపట్ల జిల్లా అధ్యక్షులు యన్నం సురేష్ మాట్లాడుతూ దివ్యాంగులు మానసిక ధైర్యంతో ఉండాలని అన్నారు. మనోధైర్యంతో, నమ్మకంతో ముందుకు వెళ్లే వ్యక్తికి వికలాంగత్వం అడ్డు కాదని అన్నారు. దేనినైనా సాధించాలనే తపన ఉంటే వైకల్యం సమస్య కాదని అన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని ప్రతి ఒక్కరూ గౌరవించి ఆదరించాలని అన్నారు. 1992లో ఐక్యరాజ్య సమితి ప్రత్యేక అవసరాలు కలిగిన దినోత్సవంగా ప్రకటించగా దానిని 1998నుండి ప్రపంచంలోని అన్ని దేశాలు జరుపుకుంటున్నాయని గుర్తు చేశారు. అనంతరం పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కంభం సురేష్, లుక్కా గోపి గౌడ్, చిలకా జగదీష్, యన్నం కార్తీక్, నాగరాజు, రాంబాబు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మూడో నంబరు ప్రమాద హెచ్చరిక

ప్రజాశక్తి - నిజాంపట్నం

పమాద హెచ్చరిక

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం క్రమేపి బలపడి తీవ్ర తుఫాన్‌గా మారుతున్న దృష్ట్యా స్థానిక హార్బర్‌లో 3వ నెంబరు ప్రమాద సూచికను ఎగరవేసినట్లు మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పి సాయి సందీప్ ఆదివారం తెలిపారు. మిచౌంగ్ తుఫాన్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు ఎవరు సముద్రంలో వేటకు వెళ్ల వద్దని అన్నారు. మత్స్యకారులు బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలలో భద్రపర్చుకోవాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నేత సాయిబాబు

టిడిపి గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

రానున్న సాధారణ ఎన్నికల్లో టిడిపి గెలుపుకు కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా కోరారు. స్థానిక వాసవి కళ్యాణ మండపంలో టిడిపి విస్తృతస్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. రాష్ట్రంలో అరాచక పాలనతో ప్రజలు విసుగు చెందిన ఉన్నారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి, అక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చైతన్యం కలిగించాలని కోరారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభించిన ప్రభుత్వాలు మనుగడ సాగించలేదని అన్నారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. కెసిఆర్ బాటలోనే జగన్ నడుస్తున్నాడని అన్నారు. ముఖ్యమంత్రి నుండి సాధారణ కార్యకర్త వరకు ప్రజలను దోచుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ కుక్కల వెంకటేశ్వరరావు, టిడిపి మాజీ అధ్యక్షులు వై కరుణ శ్రీనివాసరావు, బీసీ సెల్ నాయకులు బట్టు మల్లికార్జునరావు, సయ్యద్ సిరాజుద్దీన్, కనిపర్తి సుందరరావు, ఎడ్ల జయశీలరావు, కంభం సుధీర్, ఆదిన బసవ పున్నయ్య పాల్గొన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - నిజాంపట్నం

మిచౌంగ్ తుఫాన్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పి సాయి సందీప్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హార్బర్, నక్షత్ర నగర్‌లలో పడవల భౌతిక గణన ఆదివారం చేశారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా సురక్షిత ప్రదేశాల్లో బోట్లు, వలలు భద్రపరుచుకోవాలని చెప్పారు. ఆక్వా రైతులు తమ చెరువుల్లో డీఓ పడిపోకుండా డీఓ టాబ్లెట్స్ ఉపయోగించి నష్టం వాటిల్లకుండా జాగ్రత్త వహించాలని చెప్పారు. డీజిల్, జనరేటర్ ఇంజన్స్ సిద్ధం చేసుకోవాలని చెప్పారు. తీవ్ర వర్షం నమోదైతే కొంతమేర వాటర్ డ్రైన్ చేసుకొని గట్లు తెగకుండా చూసుకోవాలని చెప్పారు. తీర ప్రాంత ప్రజలు బయటకు రాకుండా ఇళ్లల్లోనే ఉంటూ కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, ఛార్జింగ్ బ్యాటరీలు, తగిన మందులు సిద్ధం చేసుకొని ఉంచుకోవాలని అన్నారు. ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా సురక్షితంగా ఉండాలని కోరారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూంలోని సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. హార్బర్‌ను మత్స్యశాఖ జేడీ సురేష్ పరిశీలించారు. తుఫాన్ పరిస్థితి, ప్రభావాలను మత్స్యశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రేపల్లె : అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని మత్స్య శాఖ సహాయ సంచాలకులు బి సైదా తెలిపారు. మండలంలోని పెనుమూడి తీర ప్రాంతంలో మోళ్ళగుంట గ్రామాలలో మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎస్‌కె కౌసర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మత్స్యకారులతో సమావేశ నిర్వహించారు. వేటకు వెళ్లొద్దని సూచించారు. వాతావరణ పరిస్థితులు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎలాంటి ఆపద వచ్చిన తమ దృష్టికి తీసుకు వస్తే అవసరమైన సహాయక చర్యలు అందిస్తామని తెలిపారు.

చీరాల : మిఛౌంగ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు పడవలతో సముద్రంలోకి వేటకు వెళ్ళవద్దని ఆర్డీఓ సరోజినీ మత్స్యకారులకు సూచించారు. మండలంలోని వాడరేవు సముద్ర తీరంలో ఆమె ఆదివారం పర్యటించారు. మత్స్యకారులు పడవలను ఒడ్డుకు తీసుకువచ్చినట్లు చెప్పారు. ఆమె వెంట తహాశీల్దారు జె ప్రభాకరరావు ఉన్నారు.

మత్స్యకారులకు సూచనలిస్తున్న పి సాయిసందీప్

తుఫాను హెచ్చరికలపై మత్స్యకారులతో ఎడి బి సైదా

మత్స్యకారులతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సరోజిని

రైతులు అప్రమత్తంగా ఉండాలి

తుఫానుపై రైతులకు సూచనిలస్తున్న ఎఒ వాగోలు బుష్

ప్రజాశక్తి - రేపల్లె

వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో రైతులు జాగ్రత్తగా ఉండి పంటలను కాపాడుకోవాలని ఎఒ వాగోలు బుష్ రైతులకు సూచించారు. మండలంలోని పిరాట్లాంక, చెన్నుపల్లి వారిపాలెం, గంగడి పాలెం, మోళ్ళగుంట గ్రామాలలో ఆదివారం పర్యటించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. తుఫాను ప్రభావంతో వరి పంటలు దెబ్బతినే నేపథ్యంలో జాగ్రత్తలు పాటిస్తూ పంటను కాపాడుకోవాలని అన్నారు. ఏదైనా సమస్య ఏర్పడితే దగ్గర్లోని ఆర్‌బికె సిబ్బందికి సమాచారం ఇవ్వాలని కోరారు.

చెరుకుపల్లి : వచ్చే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులందరూ కోసిన వరి పనలను ఒకచోటకు చేర్చి పట్టలు కప్పాలని, యంత్రాల సహాయంతో నూర్చిన వరిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఎఒ టి బాలాజీ గంగాధర్ సూచించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులకు సూచనలు చేశారు. సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు వచ్చే నేపథ్యంలో రైతులందరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పొలాలలో నీరు నిలవకుండా బయటికి పంపె మార్గాలు చూసుకోవాలని కోరారు.

ధాన్యం పరిశీలిస్తున్న ఎఒ టి బాలాజీ గంగాధర్

గిరిజనుల సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి - బాపట్ల

గిరిజనులు, గిరిజన విద్యార్థుల విద్యపై ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకునే విధంగా పోరాటం చేయాలని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కుంభ ఉదయ్ కుమార్ కోరారు. స్థానిక ఎన్జీఒ భవనంలో ఆదివారం జరిగిన గిరిజన ఆత్మీయ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 33లక్షల మంది గిరిజనులు ఉన్నారని అన్నారు. స్వాతంత్రం సిద్ధించి 75ఏళ్ళు గడుస్తున్నప్పటికి అనేక ప్రాంతాల్లో గిరిజనులు వెనుకబాటు తనంతో ఉన్నారని అన్నారు. నివేశన స్థలాలు లేక అనేక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం ఫెడరేషన్ జిల్లా నూతన కమిటీ అధ్యక్షులుగా దేవరకొండ రాము, జిల్లా వర్కింగ్ అధ్యక్షులుగా ఉయ్యాల రవి, కార్యదర్శులు కట్ట పెద్దన్న, ఉయ్యాల గురవయ్య, దేవర ప్రసాద్, పాలపర్తి నాగరాజు, కోశాధికారి అంగడి వెంకటేశ్వర్లు, సలహాదారుడు బొజ్జగాని రవికుమార్, మహిళా అధ్యక్షురాలు కట్టా కామేశ్వరి, మహిళా కార్యదర్శి వల్లెపు పూర్ణ ఎన్నుకుననారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి తోకల చిన్నవిరోధి పాల్గొన్నారు.

సమావేశంలో ట్రైబల్ ఫెడరేషన్ కార్యదర్శి ఉదయ్‌కుమార్

తాగునీటి చెరువును శుభ్రం చేస్తున్న పంచాయితీ సిబ్బంది

మంచినీటి చెరువు శుభ్రం

ప్రజాశక్తి - కారంచేడు

కారంచేడు పంచాయతీ ప్రజలకు త్రాగునీరు అందిస్తున్న జయ ప్రకాష్ నారాయణ చెరువును పంచాయతీ కార్మికులు శుభ్రపరిచారు. గత కొంత కాలంగా చెరువులో ఉన్న నీరు కలుషితమై దుర్వాసన రావడంతో ఆ నీటిని తొలగించి చెరువులో మంచినీరు నింపడానికి ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కె అంజయ్య తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ ఇన్‌ఛార్జి జానకిరామారావు

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

తెలంగాణలో కాంగ్రెస్ విజయ ఢంక మోగించటంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ ఇన్చార్జి పొన్నగంటి జానకీరామారావు కేక్ కట్ చేసి విజయోత్సవ వేడుకలు జరుపుకున్నారు. స్థానిక స్థూపం సెంటర్, సినిమాహాలు సెంటర్‌లో టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఒకరి కొకరు స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు షేక్ మోదిన్‌బాషా, షేక్ ఈసూబ్, సైద పాల్గొన్నారు.

నాంచారయ్యకు నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు

బీసీ నాయకుడు నాంచారయ్య మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని ఐలవరం గ్రామానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుర్రం నాంచారయ్య ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి బీసీ సంక్షేమ సంఘం వేమూరు నియోజకవర్గ అధ్యక్షులు మొరాల వాసుదేవ్ గౌడ్, మండల అధ్యక్షులు యశోద కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాంచారయ్య కుటుంబానికి సానుభూతిని తెలిపారు. దీపాల శివప్రసాద్, వామనపల్లి కోటేశ్వరరావు, అనగాని ఏడుకొండలు, మాచర్ల నాగరాజు, పంచమర్తి శంకర్రావు తదితరులు నివాళులర్పించారు.

ఓటర్ల జాబితాలు పరిశీలిస్తున్న తహశీల్దారు వెంకటేశ్వర్లు

ఓటు కోసం 92 దరఖాస్తులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

నూతనంగా ఓటర్ల మార్పులు చేర్పులు, తొలగింపులకు 172దరఖాస్తులు అందినట్లు తహసిల్దారు బి వెంకటేశ్వర్లు తెలిపారు. డిసెంబర్ 2, 3తేదీల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని 60పోలింగ్ బూతులలో దరఖాస్తుల స్వీకరణను ఆయన పరిశీలించారు. నూతనంగా ఓటు హక్కు కొరకు ఫారం6 ద్వారా 92దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మరణించిన ఓటర్ల తొలగింపునకు ఫారం7 ద్వారా 58దరఖాస్తులు, సవరణల కొరకు ఫారం8 ద్వారా 22దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. పోలింగ్ బూతులలో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

సమావేశంలో వక్ఫ్‌బోర్డు ప్రధాన కార్యదర్శి మస్తాన్‌వలి

వికలాంగుల హక్కులపై అవగాన

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

దివ్యాంగులకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని వక్ఫ్ బోర్డు జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం మస్తాన్ వలి అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు షేక్ మునిపల్లి కాలేషావలి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులకు చట్టంలో అనేక రాయితీలు కల్పించిందని తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం దివ్యంగ యువకుడు రాము నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలో మెడికల్ సర్టిఫికెట్ కోసం వెళితే లంచం డిమాండ్ చేశారని అన్నారు. తాము ఎలా ఇవ్వగలమని సభలో ఆవేదన చెందారు. పలువురు దివ్యాంగులు తాము ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. దివ్యాంగులకు ఇచ్చే ఫించన్ పెంచాలని కోరారు. జగనన్న కాలనీలో అర్హులైన దివ్యాంగులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. ట్రై స్కూటర్లు పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు పఠాన్ కాలేషావలి, సులేమాన్, ఖాదర్ వలి, రామునాయక్, రహమాన్, బాజీ, రాము పాల్గొన్నారు.

టిడిపి మైనారిటీ సెల్ నూతన కమిటీ, అధ్యక్షులు కరిముల్ల

టిడిపి మైనారిటీ అధ్యక్షుడిగా కరిముల్లా

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

టిడిపి మైనారిటీ సెల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వలపర్లకు చెందిన సయ్యద్ కరీముల్లా, షేక్ మస్తాన్ వలిని ఎంపిక చేస్తూ టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా మార్టూరుకు చెందిన బాజీవలి, బొబ్బేపల్లి చెందిన నాగూర్ భాష, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వలపర్లకు చెందిన షేక్ మీరావలి మార్టురుకు చెందిన మహమ్మద్ ఇషాక్, పటాన్ జాకీర్, కార్యదర్శులుగా చిమ్మిరిబండకు చెందిన షేక్ మస్తాన్ వలి, ఇసుక దర్శి కి చెందిన షేక్ ఖాసీం వలి, మార్టూరుకు చెందిన షేక్ రహిమ, ఘర్నపూడి పెద్ద ఖరీముల్లా, మౌలాల్, పొన్నూరు సుభాని, నాగరాజుపల్లికి చెందిన అల్లావుద్దీన్, వలపర్లకు చెందిన షేక్ మీరా హుస్సేన్, షేక్ వలి, కోనంకి చెందిన షేక్ చాంద్ నియమితులయ్యారు. నూతన కమిటీ సభ్యులకు ఎంఎల్ఎ ఏలూరి సాంభివరావు, మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ రజాక్ శుభాకాంక్షలు తెలిపారు.

ఓట్ల జాబితా పరిశీలిస్తున్న తహాశీల్దారు బ్రహ్మయ్య

పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు గత రెండు రోజులుగా ప్రత్యేక ఓటర్ల పరిశీలన శిబిరాలు నిర్వహించారు. మండలంలోని 231, 232, 239, 241, 249, 250 నంబర్ల పోలింగ్ కేంద్రాలను తహశీల్దారు పి బ్రహ్మయ్య తనిఖీ చేశారు. బిఎల్ఒలను ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరకాస్తుల వివరాలు తెలుసుకున్నారు. మండలంలో మొత్తం 54 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు.

ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ

టిడిపి మేనిఫెస్టో ప్రచారం చేస్తున్న ఇన్‌ఛార్జి కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

టిడిపి ఇన్చార్జి ఎంఎం కొండయ్య భవిష్యత్తు గ్యారెంటీ, ఊరురా వాడ కార్యక్రమాన్ని విఆర్ఎస్ కాలేజ్ సెంటర్ నందు నిర్వహించారు. ప్రసాద నగరం కాలనీలో పర్యటించి సదస్సు నిర్వహించారు. టిడిపి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు అండదండలు యిస్తుందని అన్నారు. మంచి పరిపాలన అందించే చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎం అమర్నాథ్, విష్ణుమొలకల మధు, పెడవల్లి శంభు ప్రసాద్, అడ్డగడ్డ రామయ్య, పాకల శ్రీను, చుక్కా కోటయ్య, తేలప్రోలు నాగేశ్వరావు, కౌతరపు జనార్దనరావు, గంజి పురుషోత్తం, నందం లావణ్య పాల్గొన్నారు.

బాపట్ల : ఒక్కసారి గెలిపించి చూడండి. బాపట్లను అభివృద్ధి చేసి చూపిస్తానని టిడిపి ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. ఇంటింటికి టిడిపి, మీ మాటే - నా బాట, భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమం పట్టణంలోని 9వ వార్డు ఎస్టి కాలనీలో నిర్వహించారు. మహిళలకు చీర, నిత్యావసర వస్తువులు తెచ్చుకునే సంచి, తన గురించి తెలియజేసే కరపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గొలపల శ్రీనివాసరావు, ముక్కముల సాంబశివరావు, కొల్లూరి వెంకట్రావు, ధార అశోక్, ఇనగంటి గాంధీ, ఫరీద్ మస్తాన్, సూరగని శేఖర్, హనుమాన్ పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

వైద్య శిబిరాలకు విశేష స్పందన

వైద్యపరీక్షలు చేయించుకుంటున్న డిఎస్‌పి వెంకటేశులు

ప్రజాశక్తి - బాపట్ల

ప్రభుత్వంతోపాటు అంజుమన్ ఏ ఇస్లామియా కమిటీ వంటి స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకొచ్చి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలని ఎంఎల్ఎ కోన రఘుపతి అన్నారు. గుంటూరు వేదాంత హాస్పిటల్స్ సహకారంతో పాత బస్టాండ్ వద్దగల అంజుమన్ కమిటీ కాంప్లెక్స్ ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని డిఎస్పి వెంకటేశులుతో కలిసి ఆయన ప్రారంభించారు. శిబిరంలో 3వందల మందికి గుండె జబ్బులు, ఎముకలు, కీళ్ళ, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంజుమ న్ కమిటీ అధ్యక్షులు షేక్ జిలాని, కార్యదర్శి షేక్ కరీం, వేదంతా ఆసుపత్రి నిర్వహకులు చింతా రామకృష్ణ, డాక్టర్ తిరుమల నరేష్, మంజుల శ్రీరామ్, పోలిశెట్టి శ్రీనివాస్, ఎండీ అజ్మతుల్లా పాల్గొన్నారు.

రేపల్లె : ఉచిత వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ సుఖవాసి బసవయ్య ఆర్థిక సాయం అందించటం అభినందనీయమని రోటరీ క్లబ్ అధ్యక్షులు ఎంఎం సక్సేనా అన్నారు. పట్టణంలోని వీరవల్ల కోటయ్య ఫంక్షన్ హాల్లో తీర ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిభిరాన్ని ఆదివారం నిర్వహించారు. నాలుగు దశాబ్దాలుగా ప్రజలకు వైద్య సేవలు అందిచి ప్రజాభిమానాన్ని పొందారని అన్నారు. గత 20ఏళ్లుగా నల్లూరుపాలెంలో వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. డాక్టర్ సుఖవాసి బసవయ్యను ఘనంగా సన్మానించారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరంలో 175మందికి గ్రామీణులకు వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సుఖవాసి సతీష్ బాబు, డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, వేపురి సాయేశ్వరరావు, పి శివశంకర ప్రసాద్, మల్లెల రామచంద్రరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రోటరీ అధ్యక్షుడు సక్సేనా

తుఫాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

తహాశీల్దారు వెంకటేశ్వరావు

మిచౌంగు తుఫాను ప్రభావంతో రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురవనన్న దృష్ట్యా రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహాశీల్దారు దూళిపూడి వెంకటేశ్వరరావు సూచించారు. పంట పొలాల్లో వరి కోతలు చేపట్టరాదని అన్నారు. ఈపాటికే కోసి ఉంటే పనలను బయటకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఓదే ఎండకుండా తడిగా ఉన్నట్లయితే దానిని కట్టలు కట్టి చేనులోనే నిలబెడితే కంకులు దెబ్బ తినకుండా ఉంటాయని సూచించారు. వ్యవసాయ అధికారుల సూచనల పాటించి ఉప్పు ద్రావణాన్ని స్ప్రే చేస్తే మొలకలు కూడా రాకుండా ఉంటాయని అన్నారు. హార్వెస్టర్ల ద్వారా ధాన్యాన్ని రహదారులపై ఉంచితే తక్షణమే గోతాలకు నింపుకొని సురక్షిత ప్రాంతాలకు తరలించుకోవాలని తెలిపారు. అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కిందిస్థాయిలో సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఆడుకుందాం ఆంధ్ర పేక్షకుల ఎంపిక

కారంచేడు : మండలంలో ఈనెల 15 నుంచి 20 వరకు జరగనున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలకు ఆదివారం పేక్షకులను ఎంపిక చేసినట్లు పంచాయితీ కార్యదర్శి అంజయ్య తెలిపారు. 8నుండి 14 సంవత్సరా లలోపు పిల్లలను త్వర లో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి ప్రేక్షకులు గా ఎంపిక చేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శా ఎఇ ఖాసిం, రాజా మోహన్ పాల్గొన్నారు.

నేడు,రేపు పాఠశాలలకు సెలవు

బాపట్ల : మిచౌంగ్ తుఫాను ప్రభావం దృష్ట్యా ఈ నెల 4,5తేదీల్లో జిల్లాలోని అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్న ట్లు డిఇఒ పివిజె రామారావు ఆదివారం తెలిపారు. కలెక్టర్ రంజిత్ భాషా ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొ న్నారు. 4న అర్ధరాత్రి నుండి 5మధ్యాహ్నం వరకు విద్యా ర్థులెవరూ ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.

విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం

ప్రజాశక్తి - అద్దంకి

కంపచెట్లలో ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలకు చిల్ల చెట్లు అల్లుకొని తరుచు విద్యుత్ అంతరాయం కలుగడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ అధికారులు గ్రామంలో మరమ్మతులు వచ్చిన సమయంలో చిల్లచెట్లు కనిపిస్తున్నప్పటికీ చూసి చూడనట్లు వదిలేయడం వల్లనే తమకు ఇబ్బందులు వస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతంలో మేకలు, గేదెలు ప్రక్కగా వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. మూగజీవులు ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఉన్న చిల్ల చెట్లను తినడానికి వెళ్తే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతంలోని ఉన్న చిల్ల చెట్లను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తుఫాను హెచ్చరికతో వరిబోదెలు కొప్పవేస్తున్న రైతులు

వరి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని చుట్టు ప్రక్కల గ్రామాల్లో వరి కోతలు కోశారు. కోతలు కోసిన వరి బోదెలు పొలంలోనే ఉన్నాయి. గత రెండు రోజులుగా తుఫాను హెచ్చరికలు రావడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటి వరకు వర్షాలు లేక వరి పంటని పండించడానికి రైతులు చాలా వ్యయ ప్రయాసలు పడ్డారు. తీరా పంట పండించి చేతికొందే దశలో వర్షాలు ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేక కాలవల నుండి నీళ్లు రాక రైతులు చాలా కష్టాలు పడి బోర్ల నీళ్లు పెట్టుకుని ఒక ఎకరానికి రూ.20 వేల నుంచి రూ.25వేల వరకు ఖర్చు చేసి పండించిన పంట నోటి దగ్గరకు వచ్చే సమయానికి తుఫాను ప్రభావంతో ఎక్కడ నేలపాలు అవుతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి కోత కోసిన పొలాలు భారీ వర్షాలు పడితే ఓదెలు మునిగిపోయి వడ్లు ఎక్కడ మొలకొస్తాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుఫాను ప్రభావం వలన వరి కుప్పలు వేస్తున్నారు. ఓదులు ఎండకుండా కుప్పలు వేస్తే కుప్పలోపల వడ్లు రంగు మారి పాడవుతాయేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న టిడిపి నాయకులు

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో వివిధ పోలింగ్ బూతుల వద్ద బిఎల్‌ఒలు నూతన ఓట్ల దరఖాస్తులు స్వీకరించారు. మండలంలోని ఐలవరం మండల పరిషత్ పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో టిడిపి క్లస్టర్, బూత్, యూనిట్ ఇన్చార్జులు పోలింగ్ కేంద్రానికి వెళ్లి బిఎల్ఓ వద్ద ఉన్న ఓటర్ లిస్ట్ ద్వారా ఫారం7లను పరిశీలించారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు కల్పించే విధంగా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వామనపల్లి కోటేశ్వరరావు, మాచర్ల నాగరాజు, వామునపల్లి సాంబయ్య, దీపాల ప్రసాదరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ యంత్రాంగం అప్రమత్తం

- వర్షపునీరు నిల్వ ఉండకుండా సాఫీగా వెళ్లేలా చర్యలు
- లోతట్టు కాలనీలు, శివారు ప్రాంతాల్లో కమిషనర్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

మిచౌంగ్ తుఫాన్ నేపథ్యంలో ఒంగోలు నగరపాలక సంస్థ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వర్షపునీరు రోడ్లమీద నిల్వ ఉండకుండా కాల్వల్లోకి చేరి, పోతురాజు కాలువ ద్వారా ఊరి బయటకు పంపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జెసిబిల సాయంతో మురుగు కాల్వల శుభ్రతపై దృష్టిపెట్టారు. కాలువల్లో పూడిక తీత పనులు, వ్యర్ధాలు తొలగింపు, కాల్వలకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపు పనులు ముమ్మరం చేశారు. వెంకటేశ్వరకాలనీ, చైతన్య నగర్, పేర్నమిట్ట, బలరాం కాలనీ, పోతురాజుకాలవ పరిసరాలు, రిమ్స్ కాలేజీ ఎదురు ప్రాంతాలలో కాలువలను ఆదివారం శుభ్రం చేయించారు. ఈపనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు దగ్గరుండి పర్యవేక్షించారు. లోతట్టు కాలనీలు, శివారు కాలనీలలో విస్తృతంగా పర్యటించిన కమిషనర్ ప్రజలను అప్రమత్తం చేశారు. ఏదైనా ఇబ్బందులు తలెత్తితే కార్పొరేషన్ కార్యాలయంలోని టోల్ ఫ్రీ నెంబర్ 08592 227799కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలిరావాలని ప్రజలకు తెలియజేశారు.

పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్

సివిల్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

డిగ్రీ స్థాయి నుంచి సివిల్స్‌పై అవగాహన పెంచుకోవాలని సిఎస్‌బి ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ బాల లత తెలిపారు. స్థానిక శ్రీ హర్షిణీ విద్యాసంస్థలో సిఎస్‌బి ఐఎఎస్ అకాడమీ డైరెక్టర్ బాలలత ఆధ్వర్యంలో సివిల్స్‌కి సిద్ధమవుతున్న విద్యార్థులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలత మాట్లాడుతూ డిగ్రీ మొదటి సంవత్సరం నుంచి ప్రతిరోజు న్యూస్ పేపరు చదువుతూ కరెంట్ అఫైర్స్‌పై నోట్స్ తయారు చేసుకోవాలన్నారు. ఎన్‌సిఇఆర్‌టి టెక్స్ట్ బుక్స్ చదవాలన్నారు. విద్యార్థులు ఇప్పటి నుంచే ప్రణాళిక బద్ధంగా కష్టపడి ఇష్టంతో చదివితే కచ్చితంగా ఐఎఎస్ సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్, ప్రిన్సిపల్ డి.ఆంజనేయులు, అధ్యాపకులు ఇస్మాయిల్, రాజశేఖర్, రవీంద్ర,ఎఒ ర్యాంకర్ శ్రీనివాసరావు, గిరీష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

'స్వమిత్వ'తో బహుళ ప్రయోజనం

- 808 గ్రామాల్లో డ్రోన్ సర్వే
- బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం
- రీ సర్వే వేగవంతానికి కృషి
- డిపిఒ జివి.నారాయణ రెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ముఖాముఖి

స్వమిత్వ సర్వే ప్రక్రియతో బహుళ ప్రయోజనం పొందేందుకు అవకాశం ఉన్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జివి.నారాయణ రెడ్డి తెలిపారు. గ్రామ కంఠంలోని గహాల లబ్ధిదారులకు హక్కు పత్రాలు పొందటం, ఆస్తులు, స్థలాల క్రయవిక్రయాలకు వెసులుబాటు కలుగుతుందన్నారు. లబ్దిదారులకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం లభిస్తుందన్నారు. రీ సర్వే వేగవంతానికి కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా పంచాయతీ శాఖ ద్వారా అందిస్తున్న సేవలను నారాయణరెడ్డి ప్రజాశక్తికి వివరించారు. అవన్నీ ఆయన మాటలల్లోనే...

కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలోని 38 మండలాలలో స్వమిత్వ సర్వే కొనసాగుతోంది. ఈ సర్వే ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. క్షేత్ర స్థాయి నుంచి సర్వేపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది.

808 గ్రామాలలో డ్రోన్ సర్వే

జిల్లాలో డ్రోన్ల ద్వారా 808 గ్రామాల్లో సర్వే నిర్వహించాం. ఈప్రక్రియ పూర్తయిన 146 గ్రామాల్లో ఒఆర్ఐ మ్యాపులు అందుబాటులోకి వచ్చాయి. వీటికి సంబంధించి 96 గ్రామాల్లో అగ్రికల్చరల్ రీ సర్వే ప్రక్రియ జరగాల్సి ఉంది. రీ సర్వేకు సిబ్బందిని నియమించాం. జిల్లా లో 50 గ్రామాల్లో స్వమిత్ర సర్వే వివిధ దశలలో పూర్తయింది.

విస్తరణాధికారులు నిరంతర పర్యవేక్షణ

నిర్ణీత కాలంలో సర్వే ప్రక్రియ పూర్తి చేసేందుకు విస్తరణాధికారులు ప్రతిరోజూ స్వమిత్వ గ్రామాలను సందర్శించి చర్యలు చేపట్టాలి. సమస్యలు తలెత్తినపుడు అధికారులతో సంప్రదించి సర్వే వేగవంతం చేసేందుకు కృషి చేయాలి.

సర్వే పై ప్రజలకు అవగాహన

స్వమిత్వ సర్వే ప్రక్రియ వల్ల కగిలే ప్రయోజనాలపై పంచాయతీ విస్తరణాధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి. గ్రామ కంఠంలోని గహాలకు సంబం ధించి హక్కు పత్రాలు పొందేందుకు వెసులుబాటు కలుగుతోంది. స్థలాలు,ఆస్తులకు సంబంధించిన హక్కు పత్రాలు పొందేందుకు రీ సర్వే దోహదపడుతోంది.

బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం

గ్రామ కంఠంలోని గహాలు,ఇతర ఆస్తుల ద్వారా బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం కలుగుతుంది. ఇప్పటివరకు ఈ ఆస్తులకు సంబంధించిన హక్కులు వ్యక్తులకు సంక్రమించే అవకాశం లేదు. ప్రస్తుతం రీ సర్వే ప్రక్రియతో ఈ వెసులుబాటు కలుగుతోంది.

రీ సర్వే వేగవంతం

గ్రామ స్థాయిలో రీ సర్వే ప్రక్రియ వేగవంతం చేసేందుకు సిబ్బందిని కేటాయించాం. సర్వేకు సంబంధించి గ్రామ సచివాలయాల సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేశాం. డివిజనల్ పంచాయతీ అధికారులు, పంచాయతీ విస్తరణాధికారులు ప్రతి రోజూ గ్రామాల్లో పర్యవేక్షిస్తున్నారు. రీ సర్వే పట్ల ప్రజలకు ఉన్న అపోహలు తొలగించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అందరి సహకారంతో రీ సర్వేను 100 శాతం పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.